అక్షరశక్తి
The Power of Pen
Evening Daily
సంపుటి: 20 | సంచిక: 322 | వరంగల్ | బుధవారం, 30 సెప్టెంబర్ 2026 | పేజీలు: 07

ఏదీ కష్టం అనుకోలేదు

వ్యవసాయం, వ్యాపారం, రాజకీయం...ఈ మూడు ఆయన జీవితంలో ప్రధాన అంశాలు. ఉమ్మడి కుటుంబం నేపథ్యంలో నుండి వచ్చిన ఆయన ఇప్పటికీ వ్యవసాయాన్ని మరిచిపోలేదు. వ్యాపారం ఆయన సహజ లక్షణాలను బహిర్గతం చేస్తే.. రాజకీయాలతో తిరుగులేని గుర్తింపు, విజయాలను వెంట తెచ్చుకున్నాడు. ఎప్పుడైనా ప్రజల కోసం చేసిన పనులు, ఎదుర్కొన్న పోరాటాలే తన రాజకీయ ప్రస్థానానికి, భవిష్యత్తుకు పునాది అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. విద్యార్థి నాయకుడిగా ఉన్నా, చిన్నప్పటి నుండే రాజకీయ ఆలోచనలతో, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు నడిచాడు. ఈ బాటలో ఎన్నో ముళ్ళు, పూలు. ఎన్నో కుట్రలు ఎదురైనా వెనక్కి తగ్గలేదని, తన పనితీరే తన ఎదుగుదలకు కారణమైందని చెప్పారు. తనకు గాడ్ ఫాదర్ ఎవరూ లేరని సూటిగా చెప్తూ...భూపాలపల్లి నియోజకవర్గాన్ని కుటుంబంగా భావించి అభివృద్ధి కోసం పనిచేశానని, వారితోనే నా భవిష్యత్తు అని తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన వ్యక్తిగత, రాజకీయ జీవితానికి సంబంధించిన ఆసక్తికర అంశాలను గండ్ర వెంకటరమణారెడ్డి వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. - అక్షరశక్తి, వరంగల్







ఇష్టపడి పనిచేసా

నాకు గాడ్ ఫాదర్ ఎవరూ లేరు

- నా పనితీరే నా ఎదుగుదలకు కారణం
- రాజకీయాల్లో కుట్రలు సహజం
- భూపాలపల్లి తోనే రాజకీయ అనుబంధం
- రేవంత్ సర్కారుపై ప్రజలలో అసహనం
- కేసీఆర్ రాజకీయ మేధావి

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

SPECIAL PAGE



రైతాంగ పోరాటాలను తీవ్రతరం చేయాలి

- ఏఐకేఎంఎస్‌ను గ్రామస్థాయి నుంచి సంఘటితం చేసి విస్తరించాలి
- వ్యవసాయ రంగంపై కార్పొరేట్ ఆధిపత్యాన్ని అడ్డుకోవాలి
- భూమి, ఎంఎస్‌పీ, ఉపాధి హామీ కోసం ఉద్యమాలు ఉధృతం చేయాలి
- మహాసభల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్

అఖిల భారత రైతు కూలీ సంఘం (AIKMS) 4వ జాతీయ మహాసభలు ఖమ్మంలో ప్రారంభమయ్యాయి. గత మహాసభల నుంచి ఇప్పటివరకు సంఘం నిర్వహించిన కార్యక్రమాలు, చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు, ఎదురైన అనుభవాలను వివరిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, దళితులు, ఆదివాసీలు, గ్రామీణ పేదల సమస్యలపై నిరంతర పోరాటాలను నిర్మిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. - అక్షరశక్తి, ఖమ్మం



మడిపల్లిలో ఘనంగా సహభాగిత గ్రామీణ మదింపు

అక్షరశక్తి, హసన్‌పర్తి: మడిపల్లి గ్రామంలో ఎస్ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమం (రావెప్)లో భాగంగా సహభాగిత గ్రామీణ మదింపు (పీఆర్‌ఏ) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ డా. జి. భూపాల్ రాజ్, ఏవో అనురాధ, ఏఈవో సుమన్, గ్రామ సమన్వయకర్త డా. జి. భార్గవి, సమన్వయకర్త టి. సాయి కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు. విద్యార్థులు రైతులతో కలిసి గ్రామ సామాజిక, వనరుల మ్యాపులు, పంటల వివరాలు, నేలల రకాలు, గ్రామ చరిత్ర, సమస్యల వృక్షం, సీజనల్ క్యాలెండర్ తదితరాలను రూపొందించి ప్రదర్శించారు. విద్యార్థుల కృషిని అధికారులు అభినందించారు. గ్రామీణ వ్యవసాయ పరిస్థితులను ప్రత్యక్షంగా అర్థం చేసుకునేందుకు పీఆర్‌ఏ, రావెప్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని డీన్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు, విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో తెలంగాణ విద్యార్థుల సత్తా



అక్షరశక్తి, హనుమకొండ: ముంబైలోని ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్, ములుండ్ వెస్ట్‌లో 37వ ఆల్ ఇండియా/అంతర్జాతీయ డబ్ల్యూఎఫ్ఎస్‌కేఓ కరాటే ఛాంపియన్‌షిప్ ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో భారత్‌తో పాటు కెన్యా, శ్రీలంక, నేపాల్ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14 విభాగంలో దరాల అమర్‌నాథ్ ఫైటింగ్ (కుమిటే) విభాగంలో స్వర్ణ పతకం, కటా విభాగంలో రజత పతకం సాధించాడు. అండర్ 12 విభాగంలో గజ్జల లక్ష్మీసిద్ధార్థ కటా విభాగంలో స్వర్ణ పతకం, ఫైటింగ్ (కుమిటే) విభాగంలో రజత పతకం సాధించి ప్రతిభ చాటాడు. దీంతో తెలంగాణ క్రీడాకారులు రెండు స్వర్ణాలు, రెండు రజత పతకాలు కైవసం చేసుకున్నారు. క్రీడాకారులకు డబ్ల్యూఎఫ్ఎస్‌కేఓ తెలంగాణ అధ్యక్షుడు వురుగొండ చంద్రశేఖర్ (7వ డాన్), కార్యదర్శి సోమ శ్రీధర్ (6వ డాన్), గార సునీల్ (5వ డాన్) మార్గదర్శకత్వం అందించారు. కరాటే మాస్టర్ మోహన్ కృష్ణ (బ్లాక్ బెల్ట్, 2వ డాన్) శిక్షణ ఇచ్చారు. క్రీడాకారుల క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో పాటు కోచ్‌ల శిక్షణ, మార్గదర్శకత్వం ఈ విజయానికి దోహదపడింది. రెండు స్వర్ణాలు, రెండు రజత పతకాలు సాధించిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

ఎన్‌సీసీ కేడెట్లకు వీసీ అభినందనలు



అక్షరశక్తి, కేయూ క్యాంపస్(వరంగల్): కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 34 మంది ఎన్‌సీసీ కేడెట్లు మామునూరులోని 8 గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 20 నుంచి 29 వరకు నిర్వహించిన కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ (క్యాట్‌సీ)లో ప్రతిభ కనబరిచారు. వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, రిలే పరుగు తదితర పోటీల్లో ప్రతిభ చూపడంతోపాటు ఓవరాల్ ట్రోఫీని కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. భిక్షాలు తెలిపారు. 15 మంది కేడెట్లు 'యువ ఆపద మిత్ర' శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారని చెప్పారు. ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్‌లోనూ ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈ సందర్భంగా క్యాంప్ సీనియర్ అండర్ ఆఫీసర్ పై. సాయి తేజ, క్యాంప్ అడ్జుటెంట్ పి. రిద్ధి, సార్జెంట్ ఎస్. స్వాతితోపాటు కేడెట్లను కేయూ వీసీ ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, కేర్‌టేకర్ యశస్విని, వీరయ్య నాయక్ అభినందించారు.

కేయూ పరిరక్షణకు 48 గంటల నిరసన దీక్ష





అక్షరశక్తి,కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయ పరిరక్షణ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలోని ఎస్ఎల్‌డీసీఈ వద్ద 48 గంటల నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ విశ్వవిద్యాలయంలో విద్యార్థులపై అదనపు ఫీజుల భారం ఎందుకు మోపుతున్నారో యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీజులు, ఉపకార వేతనాలు, ఫీజు తిరిగి చెల్లింపులు, స్వయం ఆర్థిక కోర్సులు, అధ్యాపకుల ఖాళీలు, వసతులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. విశ్వవిద్యాలయంలో ఏళ్లుగా కొనసాగుతున్న స్వయం ఆర్థిక కోర్సులను క్రమబద్ధీకరించాలని, మంజూరైన సుమారు 409 అధ్యాపక పోస్టుల్లో ఖాళీగా ఉన్న వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు తిరిగి చెల్లింపు బకాయిలను వెంటనే విడుదల చేసి, కాకతీయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన బకాయిలపై ప్రభుత్వం స్పష్టమైన గణాంకాలు, చెల్లింపుల కాల పట్టిక ప్రకటించాలని కోరారు. అధిక ఫీజుల కారణంగా ప్రవేశాలు తగ్గుతున్న సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ తదితర ప్రధాన ఇంజినీరింగ్, స్నాతకోత్తర కోర్సులను కాపాడేందుకు అందుబాటులో ఉండే ఫీజు విధానాన్ని రూపొందించాలని అన్నారు. విశ్వవిద్యాలయ భూములను ఆక్రమణల నుంచి కాపాడాలని, ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, వసతి గృహాల్లో ముఖ్యంగా మహిళా వసతి గృహాల్లో తాగునీరు, పారిశుధ్యం, భద్రత, నాణ్యమైన భోజనం వంటి సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. భోజనశాల వ్యవహారాల్లో జరిగినట్లు పేర్కొంటున్న ఆర్థిక అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కోరారు. 48 గంటల్లోగా యాజమాన్యం స్పందించి డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దీపిక, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ప్రముఖ్ అంబాల కిరణ్, విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి డా. నిమ్మల రాజేష్, సాయి కుమార్, వీక్షిత, అఖిల్, వినోద్, రమేష్, పవన్ కళ్యాణ్, సారిక తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ పథకంపై విస్తృత అవగాహన కల్పించాలి



అక్షరశక్తి, హన్మకొండ: పీఎం సూర్య ఘర్-ముఫ్త్ బిజ్లీ యోజన ప్రయోజనాలను గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని టిజిఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ కె. వెంకట రమణ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో అన్ని డివిజన్ కేంద్రాల్లో 'సేవా సేతు' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణపై బుధవారం హన్మకొండలోని టిజిఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి అన్ని సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. సేవా సేతు కార్యక్రమాల్లో టిజిఎన్పీడీసీఎల్, టిజిరెడ్కో అధికారులు, బ్యాంకర్ల ప్రతినిధులు అందుబాటులో ఉండి రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటుకు సంబంధించిన విధానం, దరఖాస్తు ప్రక్రియ, కేంద్ర సబ్సిడీ, బ్యాంకు రుణ సదుపాయాలు, నెట్ మీటరింగ్, విద్యుత్ బిల్లులో కలిగే ప్రయోజనాలపై వినియోగదారులకు అవగాహన కల్పించనున్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద 1 కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు గరిష్ఠంగా రూ.78 వేల వరకు కేంద్ర సబ్సిడీ లభిస్తుందని వెంకట రమణ వివరించారు. టిజిఎన్పీడీసీఎల్ పరిధిలో ఇప్పటికే 29,621 రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్ల ద్వారా సుమారు 97 మెగావాట్ల సామర్థ్యం నమోదైందని, మరో 20 వేల దరఖాస్తులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచడంతో పాటు గృహ విద్యుత్ ఖర్చును తగ్గించడమే పీఎం సూర్య ఘర్ పథకం ప్రధాన ఉద్దేశ్యమని సి.ఈ. తెలిపారు. రూఫ్‌టాప్ సోలార్ ద్వారా విద్యుత్ బిల్లును తగ్గించుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించి ప్రయోజనం పొందే అవకాశం ఉందన్నారు. అర్హత కలిగిన గృహ వినియోగదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఇళ్లపై సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సి.ఈ.లు గౌతమ్ రెడ్డి, నాగప్రసాద్, ఆర్ఈసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. లక్ష్మణాచార్యులు, చీఫ్ మేనేజర్ జ్యోతిప్రియ, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎస్. అశోక్, టిజిరెడ్కో జీఎం ప్రసాద్, ఎన్పీడీసీఎల్ జీఎంలు టి. వేణు మాధవ్, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ సహజం

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

అక్షరశక్తి, రాయపర్తి: ఎవరికైనా పదవీ విరమణ సహజం అని, విరమణ అనంతరం ఆరోగ్యంగా జీవించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. పీఎంఎస్‌హెచ్ఆర్ఐ ఉన్నత పాఠశాల కొండూరులో ఉపాధ్యాయుడు రూపి రెడ్డి రాంరెడ్డి పదవీ విరమణ సందర్భంగా పీఆర్‌టీయూ టీఎస్ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ టీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కిరెడ్డి మహేందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శానా ఉమామహేశ్వర్, వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కటకం రఘు, రాయపర్తి మండల ప్రధాన కార్యదర్శి ఆవుల రవీందర్, మండల అసోసియేట్ అధ్యక్షుడు నేతుల స్వామితో పాటు పీఆర్‌టీయూ సభ్యులు రాంరెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఉపాధ్యాయుడిగా రాంరెడ్డి అందించిన సేవలను వారు కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయన సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు.

ఆయిల్‌ఫామ్ రైతుల కమిటీ అధ్యక్షుడిగా బండారి రమేష్



అక్షరశక్తి, నర్సంపేట: ఆయిల్‌ఫామ్ రైతుల నర్సంపేట మండల కమిటీ అధ్యక్షుడిగా బండారి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నర్సంపేట రైతు వేదికలో ఆయిల్‌ఫామ్ రైతుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సంద్యాల కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుల సమక్షంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా తుమ్మ శ్యాం సుందర్, ఉపాధ్యక్షులుగా పోతు శంకర్, మోతె గోదాదేవి, సహాయ కార్యదర్శిగా పోతు నవీన్, కోశాధికారిగా వడ్లకొండ రవికిరణ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గజ్జి వెంకటేశ్వర్లు, మందడపు అప్పారావు, చుండు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. సమావేశంలో సుమారు 100 మంది రైతులు పాల్గొన్నారు.

గోదావరి ఎక్స్‌ప్రెస్ ఆలస్యంపై రైల్వే శాఖ స్పష్టత ఇవ్వాలి

- కాజీపేటలో 45 నిమిషాల నిలుపుదలపై ప్రయాణికుల సందేహాలు నివృత్తి చేయాలి: నిమ్మల శ్రీనివాస్



అక్షరశక్తి, కాజీపేట: హైదరాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే గోదావరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 29న కాజీపేటలో సుమారు 45 నిమిషాల పాటు నిలిచిన ఘటనపై రైల్వే శాఖ స్పష్టమైన వివరణ ఇవ్వాలని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ కోరారు. రైలులోని ఓ ఉన్నతాధికారి ప్రయాణిస్తున్న ప్రత్యేక కోచ్‌లో ఏసీకి సంబంధించిన సాంకేతిక సమస్య తలెత్తడంతో రైలు నిలిచినట్లు వార్తలు వెలువడ్డాయని తెలిపారు.

అయితే ఏసీ సమస్య కారణంగానే రైలును 45 నిమిషాల పాటు నిలిపివేశారా? రైలు భద్రతకు సంబంధించిన సాంకేతిక లోపం ఏమైనా ఉందా? అనే అంశాలపై రైల్వే అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. సమస్య భద్రతకు సంబంధించినదైతే ప్రయాణికుల భద్రత కోసం తీసుకున్న చర్యలను వెల్లడించాలని, ఏసీ సమస్య మాత్రమే అయితే అంతసేపు రైలును నిలిపివేయాల్సిన అవసరం ఎందుకు ఏర్పడిందో వివరించాలని అన్నారు.

రైలు నిలుపుదల కారణంగా ఇతర రైళ్ల రాకపోకలపై ప్రభావం పడిందా, ఈ సందర్భంలో రైల్వే నిబంధనల ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకున్నారో కూడా వెల్లడించాలని నిమ్మల శ్రీనివాస్ కోరారు. ఎవరినీ వ్యక్తిగతంగా తప్పుబట్టడం తమ ఉద్దేశం కాదని, ప్రయాణికుల సందేహాలను నివృత్తి చేసి రైల్వే సేవల్లో పారదర్శకతను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు కావాల్సింది ఆరోపణలు కాదని, వాస్తవాలపై స్పష్టతేనని ఆయన అన్నారు. రైల్వే ఉన్నతాధికారులు ఘటనపై పూర్తి వివరాలను వెల్లడించి ప్రయాణికుల సందేహాలను నివృత్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే ఉద్యమాలు ఉధృతం

- ఎన్నికల హామీలను అమలు చేయాలి
- ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ



అక్షరశక్తి, నర్సంపేట: రాష్ట్రంలోని పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టడం రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని అన్నారు. ఎంసీపీఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నర్సంపేట మండల కార్యాలయంలో ఎమ్మార్వోకు బుధవారం మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా రాగసుధ మాట్లాడుతూ.. ప్రస్తుతం రూ.2 వేల పింఛన్‌తో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు జీవనం సాగించడం కష్టంగా మారిందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పింఛన్లు పెంచి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల చొప్పున దసరా కానుకగా అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు, ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు.

మహిళలకు ఇస్తామన్న రూ.2,500 హామీని తక్షణమే అమలు చేయాలని, ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేయాలని అన్నారు. ప్రతి మండల కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేసి పేదలకు ఉచిత వైద్యం, మందులు అందించాలని డిమాండ్ చేశారు. పేదలకు విద్య, వైద్యం హక్కుగా ప్రభుత్వ విద్యా, వైద్య రంగాలను బలోపేతం చేసి ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని రాగసుధ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు కర్నే సాంబయ్య, ఉప్పుల పద్మ, గణిపాక బిందు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవల విస్తరణకు కృషి చేస్తా

ఇ.వి. శ్రీనివాస్ రావు



అక్షరశక్తి,హనుమకొండ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర పాలక మండలి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఇ.వి. శ్రీనివాస్ రావును పూలే ఆశయ సాధన సమితి (PASS) ఆధ్వర్యంలో హనుమకొండలోని హరిత కాకతీయలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, తనపై విశ్వాసంతో రాష్ట్ర పాలక మండలి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేసి, సమాజంలోని ప్రతి వర్గానికి సేవలు చేరేలా సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. రక్తదానం, ఆరోగ్య సేవలు, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సేవా స్ఫూర్తిని మరింత విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్, PASS జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, రెడ్డి జాగృతి నాయకులు గుర్రం ప్రభాకర్ రెడ్డి, రెంటాల కేశవరెడ్డి తదితరులు పాల్గొని ఇ.వి. శ్రీనివాస్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఐఈఏ వార్షిక సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



అక్షరశక్తి, వరంగల్: ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ (ఐఈఏ) 109వ వార్షిక సదస్సు పోస్టర్‌ను శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ యు. ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. సతీష్ కుమార్, ప్రొఫెసర్ బి. సురేష్ లాల్, కాకతీయ విశ్వవిద్యాలయం సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ డీన్, సదస్సు స్థానిక నిర్వహణ కార్యదర్శి డాక్టర్ కే. శ్రీవాణి, శాతవాహన విశ్వవిద్యాలయం సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎం. వరప్రసాద్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బి. సురేష్ లాల్ మాట్లాడుతూ డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో కాకతీయ విశ్వవిద్యాలయంలో సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు హాజరయ్యే వారు ఐఈఏ వెబ్‌సైట్ ద్వారా అక్టోబర్ 25లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వివిధ అంశాలపై పరిశోధనా పత్రాలను అక్టోబర్ 5లోగా, తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన పరిశోధనా వ్యాసాలను అక్టోబర్ 30లోగా సమర్పించాలని తెలిపారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై సమర్పించే వ్యాసాలను ప్రత్యేక జర్నల్‌లో ప్రచురించనున్నట్లు వెల్లడించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాకతీయ, శాతవాహన విశ్వవిద్యాలయాల అర్థశాస్త్ర విభాగాల అధ్యాపకులు, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు

డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



అక్షరశక్తి, హనుమకొండ: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్‌లోని పలు కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఇన్‌చార్జి డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తెలిపారు. బుధవారం 60వ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌తో కలిసి ఆయన కాలనీల్లో పర్యటించారు. స్థానిక ప్రజలను కలిసి మౌలిక వసతులు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు. సమస్యలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికారుల సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు శివ, శ్రీనివాస్, కమల్, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి: కలెక్టర్



అక్షరశక్తి, వేలేరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. బుధవారం వేలేరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించి వైద్యులు, సిబ్బంది సంఖ్య, విధులకు హాజరైన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ అటెండెన్స్‌ను పరిశీలించి మీ ప్రమాణం యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలపై ఆరా తీశారు. ల్యాబొరేటరీని పరిశీలించి నిర్వహిస్తున్న పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వైద్య సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేఘన, తహసీల్దార్ కోమి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గత పాలకులు దోచిన భూములను ఉద్యమకారులకు పంచాలి

తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ వెంకటనారాయణ



అక్షరశక్తి, హనుమకొండ: గత పాలకుల హయాంలో అక్రమంగా స్వాధీనం చేసుకున్న భూములను గుర్తించి తెలంగాణ ఉద్యమకారులకు పంచాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం బాలసముద్రంలోని తన నివాసంలో ఉద్యమ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కుటుంబ సభ్యులు, బంధువులు, అప్పటి మంత్రులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున భూములు, ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ, పేదల అసైన్డ్ భూములను ఆక్రమించిన వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న విచారణను ఇతర జిల్లాల్లో జరిగిన భూదందాలకూ విస్తరించాలని అన్నారు. ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని జరిగిన భూ అక్రమాలపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తుల కమిటీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆక్రమ ఆస్తులు కూడబెట్టిన రాజకీయ నాయకులు, అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన 1,560 కుటుంబాలతో పాటు వేలాది మంది ఉద్యమకారులను గత పాలకులు విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులను గుర్తించి, అక్రమంగా ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని వారికి పంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చిల్లా రాజేంద్ర ప్రసాద్, దారం జనార్దన్, సాయిని నరేందర్, బొమ్మినేని పాపిరెడ్డి, దొమ్మాటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన బుడిగె సతీష్‌గౌడ్



అక్షరశక్తి, హైదరాబాద్ : హైదరాబాద్‌లో బుధవారం నాడు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బుడిగె సతీష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రిగారిని శాలువాతో సన్మానించి, పుష్ప గుచ్ఛం అందించి, పలు అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతం కోసం పని చేయాలని మంత్రిగారు సూచించారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని అన్నారు. అంతేగాకుండా, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలని మంత్రి పొన్నం చెప్పారు. గ్రామంలో ఎవరికి కష్టం వచ్చినా.. వారికి స్థానిక నాయకులతో కలిసి చేయూత అందిస్తున్నారని ఈ సందర్భంగా బుడిగె సతీష్‌గౌడ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్‌ను అభినందించారు.

సీఎం వ్యాఖ్యలపై బీజేపీ ధార్మిక్ పరిషత్ ఆగ్రహం

- **హిందూ దేవుళ్ల మధ్య విభజన సృష్టించేలా మాట్లాడటం సరికాదు: దేవి ప్రసాద్ సముద్రాల**



అక్షరశక్తి, హైదరాబాద్: హిందూ దేవుళ్ల మధ్య విభజన సృష్టించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ ధార్మిక్ పరిషత్ స్టేట్ జాయింట్ కన్వీనర్ దేవి ప్రసాద్ సముద్రాల అన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొంటూ ఆయన తీవ్రంగా ఖండించారు. రాముడిని బీజేపీ దేవుడిగా, దక్షిణాదిలో శివుడినే పూజిస్తారంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు హిందూ సమాజంలో విభజనకు దారితీసేలా ఉన్నాయని దేవి ప్రసాద్ సముద్రాల విమర్శించారు. దేశవ్యాప్తంగా రాముడు, శివుడిని భక్తులు సమానమైన భక్తిశ్రద్ధలతో పూజిస్తారని తెలిపారు. 12 జ్యోతిర్లింగాల్లో రెండు దక్షిణాదిలో, మిగిలినవి ఇతర ప్రాంతాల్లో ఉన్న విషయాన్ని గుర్తుచేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో తన సతీమణితో కలిసి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణంలో పాల్గొని పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ దేవుళ్లను, భక్తుల విశ్వాసాలను రాజకీయాల్లోకి తీసుకురావడం మానుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ ధార్మిక్ పరిషత్ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రచ్చ బాలు, నాగిళ్ల వేణుశర్మ, మచ్చ కిరణ్, లలిత్ కిషోర్, దేవరకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకోవాలి

కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



అక్షరశక్తి, వేలేరు: విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుని సొంత గ్రామాలకు సేవలందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. బుధవారం వేలేరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని ఆమె సందర్శించారు. పాఠశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి నిర్ణీత సమయానికి శుభ్రం చేయించాలని ఆదేశించారు. మెనూ ప్రకారం కూరగాయలు, నిత్యావసర సరుకులు అందుతున్నాయా అని ఆరా తీశారు. తరగతి గదుల్లో ఫ్యాన్ల పనితీరును పరిశీలించారు. డార్మెట్రీలను సందర్శించి విద్యార్థినుల సంఖ్య, వసతి పరిస్థితులను తెలుసుకున్నారు. డార్మెట్రీల్లోకి దోమలు రాకుండా అన్ని గదులకు మెష్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజుగౌడ్, తహసీల్దార్ కోమి, జీసీడీవో సునీత, ఎంపీడీవో కిషన్, ఎంఈవో చంద్రమౌళి, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్రవంతి, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతాంగ పోరాటాలను తీవ్రతరం చేయాలి



- **ఏఐకేఎంఎస్‌ను గ్రామస్థాయి నుంచి సంఘటితం చేసి విస్తరించాలి**
- **వ్యవసాయ రంగంపై కార్పొరేట్ ఆధిపత్యాన్ని అడ్డుకోవాలి**
- **భూమి, ఎంఎస్‌పీ, ఉపాధి హామీ కోసం ఉద్యమాలు ఉధృతం చేయాలి**
- **మహాసభల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్**



అక్షరశక్తి, ఖమ్మం: అఖిల భారత రైతు కూలీ సంఘం (AIKMS) 4వ జాతీయ మహాసభలు ఖమ్మంలో ప్రారంభమయ్యాయి. గత మహాసభల నుంచి ఇప్పటివరకు సంఘం నిర్వహించిన కార్యక్రమాలు, చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు, ఎదురైన అనుభవాలను వివరిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, దళితులు, ఆదివాసీలు, గ్రామీణ పేదల సమస్యలపై నిరంతర పోరాటాలను నిర్మిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతాంగ ఉద్యమంలో క్రియాశీల పాత్ర

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సాగిన రైతాంగ పోరాటాల్లో ఏఐకేఎంఎస్ చురుకైన పాత్ర పోషించిందని మిట్టల్ తెలిపారు. ఢిల్లీ సరిహద్దులు, పంజాబ్ తదితర ప్రాంతాల్లో జరిగిన రైతాంగ ఉద్యమంలో విస్తృతంగా పాల్గొని ఉద్యమాన్ని బలోపేతం చేసినట్లు వివరించారు. మూడు వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తీసుకురావడంలో రైతాంగ ఉద్యమం కీలక విజయం సాధించిందన్నారు. ఈ పోరాటం ద్వారా పంజాబ్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో రైతాంగంతో ఏఐకేఎంఎస్ సంబంధాలు విస్తరించాయని తెలిపారు. కొత్త ప్రాంతాల్లో సంస్థకు పరిచయాలు ఏర్పడి ఉద్యమ విస్తరణకు మార్గం సుగమమైందన్నారు. ఉద్యమ సమయంలో ఎదురైన అనుకూల, ప్రతికూల అనుభవాలను సమీక్షించుకుని భవిష్యత్ పోరాటాలకు వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు.

భూమి సమస్యపై నిరంతర పోరాటాలు

భూమిలేని పేదలు, రైతులు, కౌలు రైతులు, దళితులు, ఆదివాసీల భూమి సమస్యలపై బిహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఏఐకేఎంఎస్ పోరాటాలు నిర్వహించిందని నివేదికలో పేర్కొన్నారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రతిఘటిస్తూ రైతులు, భూమిపై ఆధారపడిన ప్రజలను సమీకరించి పలు పోరాటాలు చేపట్టినట్లు తెలిపారు. భూకబ్జాలు, భూస్వామ్య దోపిడీ, ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియాలకు వ్యతిరేకంగా ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఉద్యమాలు సాగించినట్లు వివరించారు. పంజాబ్‌లో దళితులకు భూమి సాధించేందుకు నిర్వహించిన పోరాటాలు, పోలీసుల నిర్బంధం, వందలాది మంది కార్యకర్తలు మూడు నెలలపాటు జైలు జీవితం గడిపిన అంశాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ఆదివాసీ ప్రాంతాల్లో కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా

ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ఆదివాసీ ప్రాంతాల్లో జరుగుతున్న భూసేకరణ, అడవుల ఆక్రమణ, సహజ వనరుల దోపిడీకి వ్యతిరేకంగా వివిధ ప్రజా ఉద్యమాలతో కలిసి ఏఐకేఎంఎస్ పనిచేసిందని మిట్టల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఆదివాసీలను సమీకరించి భూమి, అడవి, సహజ వనరుల పరిరక్షణ కోసం పోరాటాలు నిర్వహించినట్లు చెప్పారు. స్థానిక సమస్యను గుర్తించి వాటి ఆధారంగా దీర్ఘకాలిక ఉద్యమాలను నిర్మించాలని సూచించారు.

ఎంఎస్‌పీ కోసం ఉద్యమాలు

రైతుల పంటలకు కనీస మద్దతు ధర (MSP)కు చట్టబద్ధమైన హామీ కల్పించాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమాల్లో ఏఐకేఎంఎస్ క్రియాశీలంగా పాల్గొన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. రైతుల ఉత్పత్తికి గిట్టుబాటు ధర, రుణభారం నుంచి విముక్తి, రైతుల జీవన భద్రత వంటి అంశాలను భవిష్యత్ పోరాటాల్లో మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఉపాధి హామీ పరిరక్షణకు పోరాటం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGA)ను బలహీనపరిచి, దాని స్థానంలో VBGRAMG వంటి కొత్త విధానాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ వివిధ రాష్ట్రాల్లో AIKMS ఉద్యమాలు నిర్మించిందని నివేదికలో పేర్కొన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి హామీ, కూలీలకు పని దినాలు, వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తృతమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

గ్రామస్థాయి నుంచి సంఘ నిర్మాణం

గత పోరాటాల విజయాలను సమీక్షించుకోవడంతో పాటు, వాటి నుంచి సంస్థాగత నిర్మాణానికి అవసరమైన పాఠాలను నేర్చుకోవాలని జాతీయ ప్రధాన కార్యదర్శి సూచించారు. సభ్యత్వాన్ని గణనీయంగా పెంచడం, ప్రతి గ్రామంలో సంఘాన్ని నిర్మించడం, మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలను బలోపేతం చేయడం, రాష్ట్ర కమిటీలను మరింత క్రియాశీలంగా తీర్చిదిద్దడం ప్రధాన కర్తవ్యాలని తెలిపారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, దళితులు, ఆదివాసీలు, గ్రామీణ పేదల వాస్తవ సమస్యలను గుర్తించి వాటిపై నిరంతర పోరాటాలు నిర్వహించడం ద్వారానే AIKMSను విస్తృత ప్రజా సంస్థగా బలోపేతం చేయగలమని నివేదిక స్పష్టం చేసింది. గత పోరాటాల అనుభవాలను సమీక్షించుకుని కొత్త ప్రాంతాలకు విస్తరిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో బలమైన సంస్థాగత పునాదులు నిర్మించడమే 4వ జాతీయ మహాసభల ప్రధాన లక్ష్యమని మిట్టల్ పేర్కొన్నారు.

ఏకగ్రీవంగా నివేదిక ఆమోదం

మహాసభలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు కార్యదర్శి నివేదికపై చర్చలో పాల్గొన్నారు. అనంతరం నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశానికి అధ్యక్ష వర్గంగా వేములపల్లి వెంకట రామయ్య, సుశాంత్, జై చలపతిరావు, రవీందర్‌సింగ్ తదితరులు వ్యవహరించారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

అక్షరశక్తి, ములుగు: ములుగు జిల్లా వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.7 వేల జరిమానా విధిస్తూ ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. రామానుజాపూర్ గ్రామానికి చెందిన పల్లెబోయిన క్రాంతి (27)ని దోషిగా నిర్ధారిస్తూ ప్రత్యేక పోక్సో కోర్టు ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్.వి.పి. సూర్యచంద్రకళ ఈ తీర్పు ఇచ్చారు. వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 135/2021 కింద ఐపీసీ 366, 376(2)(n), పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్‌విత్ 6 కింద కేసు నమోదైంది. ఎస్ఐ డి. రమేష్ ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, డబ్ల్యూఎస్ఐ పి. రాధిక దర్యాప్తులో



భాగంగా సంబంధిత సెక్షన్లను మార్చారు. మొదటి దర్యాప్తు అధికారిగా పి. సాయి చైతన్య ఐపీఎస్, రెండో దర్యాప్తు అధికారిగా అప్పటి ములుగు ఏఎస్పీ, ప్రస్తుత ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్ వ్యవహరించారు. కేసు దర్యాప్తు, కోర్టు సమన్వయం, ప్రాసిక్యూషన్‌లో కోర్టు మానిటరింగ్ అధికారి డీఎస్పీ కిషోర్, కోర్టు లైజనింగ్ అధికారి ఏఎస్ఐ ఎల్. కుమారస్వామి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి. రామ్‌సింగ్, సీడీఓలు జె. శ్రీను, వై. శ్రవంతి తదితరులు కీలకంగా పనిచేశారు. సమిష్టిగా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్ అభినందించారు. నాణ్యమైన దర్యాప్తుతో పాటు బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రభుత్వ వృత్తివిద్యా కళాశాలలో సౌకర్యాలు కల్పించాలి

- 900 మంది విద్యార్థులకు కనీస టాయిలెట్లు లేకపోవడం సిగ్గుచేటు
- సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం
- డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పల శివ



అక్షరశక్తి, హనుమకొండ: ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ) హనుమకొండ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీఎస్ఏ ఆధ్వర్యంలో అశోక జంక్షన్‌లో కళాశాల విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పల శివ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో వృత్తివిద్యా కళాశాలల్లో అత్యధిక అడ్మిషన్లు నమోదైన కళాశాలగా గుర్తింపు పొందిన హనుమకొండ ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాలలో సుమారు 900 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఇంతమంది విద్యార్థులు ఉన్న కళాశాలలో తాగునీరు, టాయిలెట్లు, బెంచీలు వంటి కనీస సదుపాయాలు లేకపోవడం బాధాకరమన్నారు. 2023లోనే కళాశాలలో టాయిలెట్ల నిర్మాణానికి అనుమతులు మంజూరైనా ఇప్పటివరకు ఒక్క ఇటుక కూడా పేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్ లేకపోవడంతో పాఠాలు సక్రమంగా జరగడం లేదని, కొన్ని కోర్సులకు సరిపడా అధ్యాపకులు లేకపోవడంతో అవి మూతపడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కళాశాల సమస్యలపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని శివ ఆరోపించారు. విద్యార్థుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీఐఈఓను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే తక్షణమే స్పందించి టాయిలెట్లు నిర్మించడంతో పాటు కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సమస్యలను పరిష్కరించక పోతే డీఎస్ఏ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధర్నాలో డీఎస్ఏ జిల్లా నాయకులు చందన, శ్వేత, కమల్, వెంకటేశ్, గోవర్ధన్, సంపత్, రాజుకుమార్, కౌశిక్, జాషువా, రక్షిత్‌తో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

3న 'రోహిత్ వేముల చట్టం'పై రౌండ్‌టేబుల్

- కేయూలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సమావేశం



అక్షరశక్తి, కేయూ క్యాంపస్ (వరంగల్): కాకతీయ విశ్వవిద్యాలయంలో అక్టోబర్ 3న 'రోహిత్ వేముల చట్టం'పై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఎస్ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కేయూ కన్వీనర్ దండు నవకిరణ్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రొఫెసర్ జాఫర్ నిజాంహాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏఎస్ఏ, టీఎస్‌బీఎఫ్, ఏబీఎస్ఎఫ్, డీఎస్ఏ, డీఎస్‌యూ, టీఆర్ఎస్‌వీ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎస్‌యూ, ఎంఎస్ఎఫ్, ఏఎంఎస్ఏ, డీఐఎస్‌డబ్ల్యూ, ఎస్ఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, బీఎస్ఎఫ్ఐ, కూర్సా, టీఆర్ఎస్ఏ, టీఎస్ఎఫ్ఐ, ఎస్సీ/ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ తదితర సంఘాల భాగస్వామ్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం కేయూ ప్రాంగణంలో సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యా సంస్థల్లో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు వివక్షను ఎదుర్కొంటున్నారని నవకిరణ్ పేర్కొన్నారు. సమావేశానికి హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏఎస్ఏ హెచ్‌సీయూ మాజీ అధ్యక్షుడు డాక్టర్ దొంత ప్రశాంత్, కేయూ ప్రొఫెసర్లు డా. వై. వెంకయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ పి. వరలక్ష్మి, ప్రొఫెసర్ ఎల్పీ. రాజ్‌కుమార్, ప్రొఫెసర్ కె. భిక్షాలు, ప్రొఫెసర్ చిర్ర రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఏ. రాజు, పోడేటి శ్రీనివాస్, టీ. రాజమణి, డాక్టర్ పుల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కోమగాని శ్రవణ్ మాట్లాడుతూ రోహిత్ వేముల చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేయూ టీఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు పి. వినయ్‌కుమార్, టీఎస్‌బీఎఫ్‌కేయూ ఇన్‌చార్జి మురళి, ఏఎంఎస్ఏకేయూ అధ్యక్షుడు గుండు రాజేష్, రీసెర్చ్ స్కాలర్లు తిరుపతి, అజయ్, అశోక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఆర్చరీ జట్ల ఎంపికలు



అక్షరశక్తి, కేయూ క్యాంపస్(వరంగల్): కాకతీయ విశ్వవిద్యాలయంలో బుధవారం ఆర్చరీ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన పురుష, మహిళా క్రీడాకారులు ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో జరిగిన ఎంపికల్లో పాల్గొన్నారు. సుమారు 25 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన కేయూ ఆర్చరీ జట్లు డిసెంబర్‌లో అస్సాంలోని తేజస్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటాయని కేయూ స్పోర్ట్స్‌బోర్డు కార్యదర్శి డా. టి. శాస్త్రి తెలిపారు. ఎంపికలను కేయూ వీసీ ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి ప్రారంభించగా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం క్రీడాకారులను అభినందించారు. ఎంపికైన వారికి కేయూ గ్రౌండ్స్‌లో 15 రోజుల కోచింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ ఇన్‌చార్జి డా. ఎస్. కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డా.ఏటీబీటీ ప్రసాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ పీడీ ఆంజనేయులు, పీడీ సుమన్, న్యూ సైన్స్ కళాశాల పీడీ, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ పర్వీస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు
అమలు చేయాలి

ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి హంసారెడ్డి

అక్షరశక్తి, హనుమకొండ: ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలని ఎంసీపీఐ(యు) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్. హంసారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం హనుమకొండ మండల డిప్యూటీ తహసీల్దార్‌కు పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హంసారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు అధికారాన్ని అప్పగించినా వాటి అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వృద్ధులు, వితంతువులు, ఇతర వర్గాల పింఛన్లను నెలకు రూ.4 వేలకు పెంచాలని, మహిళలకు నెలకు రూ.2 వేలు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. 60 గజాల ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేసి ప్రైవేటు విద్యా దోపిడీని నియంత్రించాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, మాలోతు రాజేష్ నాయక్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీపురు ఓదయ్య, జిల్లా కమిటీ సభ్యులు మంద భద్రయ్య, పార్టీ సభ్యులు అన్నబోయిన ప్రేమలత, నూతనకంటి బాబు, శిరీష, అరుణలక్ష్మి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల జీవో 6 అమలు చేయాలి

టీయూసీఐ అధ్యక్షుడు కొత్తపల్లి రవి



అక్షరశక్తి, తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం సవరించి విడుదల చేసిన 73 రకాల కనీస వేతనాల జీవోలను పటిష్ఠంగా అమలు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. టీయూసీఐ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ పిలుపులో భాగంగా జీవో నంబర్ 6 అమలు కోరుతూ ఈ నెల 20 నుంచి 30 వరకు వివిధ దశల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొర్రూరు మున్సిపల్ కార్మికులతో కలిసి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కమిషనర్ శ్యామ్‌సుందర్‌కుమార్, చైర్మన్ తునం శ్రావణ్‌కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కనీస వేతనాల జీవోలను అమలు చేయడం లేదని విమర్శించిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని మూడు కేటగిరీలుగా విభజించి వేతనాలు నిర్ణయించారని, దీని ప్రకారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 1.20 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని కార్మిక శాఖ మంత్రి చెప్పడం వాస్తవం కాదన్నారు. లక్షలాది మంది అసంఘటిత కార్మికులు కనీస వేతనాలు లేక చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జీవో నంబర్ 6 అమలును పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక మొబైల్ పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తొర్రూరు మున్సిపాలిటీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీయూసీఐ అధ్యక్షుడు శ్రీరామ్ పుల్లయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్వపల్లి వెంకన్న, అధ్యక్షుడు గురుకుల యాకయ్య, జిల్లా అధ్యక్షుడు మహేందర్, వెంకట్రాం, నరసయ్య, వెంకన్న, రామస్వామి, చంద్రయ్య, కుమార్, వెంకటయ్య, వెంకన్నస్వామి, శ్రీకాంత్, లక్ష్మయ్య, లక్ష్మి, శ్రీలత, వెంకటమ్మ, యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అంటే పుస్తకాలు, తరగతి గదులు, పరీక్షలు మాత్రమే కాదు.. ప్రకృతిని పరిచయం చేసే వేదిక కూడా కావాలి. విత్తనం మొక్కగా ఎలా మారుతుంది? మనం తినే కూరగాయలు ఎలా పండుతాయి? ఆరోగ్యకరమైన ఆహారం ఎందుకు అవసరం? వ్యవసాయం, పర్యావరణం మధ్య సంబంధం ఏమిటి? వంటి విషయాలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకునేలా ములుగు జిల్లాలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌కు చెందిన డి.ఎన్.ఆర్. ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దేవగిరిపట్నం, జంగాలపల్లి, అబ్బాపురం, రామన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మోడల్ కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలాన్ని సద్వినియోగం చేసుకుంటూ కూరగాయలు, ఆకుకూరలు, పోషక విలువలు కలిగిన పంటలను సహజ, సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయడం ఈ కార్యక్రమం లక్ష్యంగా కొనసాగుతున్నది.

- అక్షరశక్తి, ములుగు

పాఠశాలల్లో పచ్చని పాఠాలు!



ఒక ఆలోచనతో ఆరోగ్యానికి బాటలు

ములుగు జిల్లాలో డి.ఎన్.ఆర్. ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మోడల్ కిచెన్ గార్డెన్లు ఒక తోట విద్యార్థులకు ఎన్నో జీవన పాఠాలు

విద్యార్థుల శ్రమతో పచ్చదనం

కిచెన్ గార్డెన్ల అభివృద్ధిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది భాగస్వాములవుతున్నారు. విద్యార్థులు శ్రమదానం చేయడం ద్వారా తోటతో అనుబంధం పెంచుకుంటున్నారు. తాము నాటిన మొక్కను తామే సంరక్షించడం వల్ల బాధ్యతాభావం కూడా పెరుగుతోంది.



దొడ్డ ప్రతాప్ రెడ్డి మార్గదర్శకత్వంలో..

డి.ఎన్.ఆర్. ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ దొడ్డ ప్రతాప్ రెడ్డి మార్గదర్శకత్వంలో వినూత్న కార్యక్రమం కొనసాగుతోంది. ట్రస్ట్ వ్యవసాయ సలహాదారు దొడ్డ సాంబారెడ్డి స్థానిక నేల, వాతావరణం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు విధానాలపై సూచనలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ దొడ్డ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, శ్రమ విలువ వంటి జీవన అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ములుగు జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని మరిన్ని పాఠశాలలకు విస్తరించాలని ఆకాంక్షించారు. “ప్రతి పాఠశాలలో ఒక పచ్చని తోట ఉంటే అది కేవలం పంటను ఇవ్వదు.. పిల్లలకు ఆరోగ్యం, బాధ్యత, ప్రకృతి ప్రేమ, శ్రమ విలువ, పర్యావరణ చైతన్యం వంటి ఎన్నో జీవిత పాఠాలను అందిస్తుంది. ప్రతి ప్రభుత్వ పాఠశాల ‘గ్రీన్ స్కూల్-హెల్తీ స్కూల్’గా మారాలి” అని పేర్కొన్నారు.



ఒక తోట.. ఎన్నో పాఠాలు...

ములుగులో ప్రారంభమైన ఈ ప్రయత్నం పాఠశాల విద్యకు పచ్చని కొత్త అర్థాన్ని ఇస్తోంది. ఒక విత్తనం మొక్కగా ఎదిగినప్పుడే.. ఒక చిన్న ఆలోచన కూడా పెద్ద మార్పుకు నాంది కావచ్చు. పాఠశాల ప్రాంగణాల్లో తోటలు పెరిగితే పచ్చదనంతో పాటు విద్యార్థుల్లో ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయం, పర్యావరణం పట్ల అవగాహన కూడా పెరుగుతుంది. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే అన్ని రంగాలలో రాణిస్తారు. ప్రభుత్వాలు కూడా ఇలాంటి ప్రయోగాల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



తరగతి గది బయట మరో పాఠశాల...

కిచెన్ గార్డెన్ అంటే కేవలం కూరగాయలు పండించే ప్రదేశం కాదు. విద్యార్థులకు ఒక జీవన ప్రయోగశాల. విత్తనం నాటడం నుంచి మొక్కను సంరక్షించడం, నీరు అందించడం, కలుపు తొలగించడం, పంటను కోయడం వరకు విద్యార్థులు స్వయంగా పాల్గొంటారు. దీనివల్ల శ్రమ గౌరవం, బాధ్యత, సహకారం, ప్రకృతి ప్రేమ వంటి విలువలు అలవడతాయి. మొక్కల ఎదుగుదలను పరిశీలించడం, వాటి సంఖ్యను లెక్కించడం, పంట దిగుబడిని అంచనా వేయడం ద్వారా గణితం, విజ్ఞానశాస్త్రం, పర్యావరణ విద్య వంటి అంశాలను ఆచరణాత్మకంగా నేర్చుకునే అవకాశం కలుగుతుంది.

పాఠశాల తోట నుంచే పోషకాహారం

కిచెన్ గార్డెన్లలో పండించే కూరగాయలు, ఆకుకూరలను సాధ్యమైన మేరకు మధ్యాహ్న భోజనంలో వినియోగించడం ద్వారా విద్యార్థులకు తాజా ఆహారం అందించవచ్చు. తాము పెంచిన కూరగాయలను తామే ఆహారంగా తీసుకోవడం వల్ల పిల్లల్లో కూరగాయలు, ఆకుకూరలు తినే అలవాటు కూడా పెరిగే అవకాశం ఉంది. ఆహారం ఎక్కడి నుంచి వస్తుందో తెలుసుకున్న పిల్లలు.. ఆహారం విలువను కూడా తెలుసుకుంటారు అనే ఆలోచన ఈ కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొస్తోంది.

ప్రతాప్ రెడ్డి



Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.

అక్షరశక్తి Evening Daily

ఇష్టపడి పనిచేసా

నాకు గాడ్ ఫాదర్ ఎవరూ లేరు

నా పనితీరే నా ఎదుగుదలకు కారణం

రాజకీయాల్లో కుట్రలు సహజం

భూపాలపల్లి తోనే


రాజకీయ అనుబంధం

రేవంత్ సర్కారుపై ప్రజలలో అసహనం

కేసీఆర్ రాజకీయ మేధావి

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే

గండ్ర వెంకటరమణారెడ్డి



పూర్తిస్థాయి రాజకీయాల వైపు..


1989 నుంచి పూర్తిస్థాయి నాయకుడిగా పనిచేశాను. యూత్ కాంగ్రెస్‌లో జిల్లా స్థాయిలో పనిచేశాను. ఆ రోజుల్లో నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉండేది. మా ఇల్లు రోడ్డుకు ఉండేది. రాజకీయాల్లో యాక్టివ్‌గా తిరుగుతుంటే నన్ను తీసుకెళ్లారు. మా ఇంటిని పేల్చేశారు. నాన్న రాజకీయాలు వద్దనేవారు. కానీ నా పట్టుదల, పోరాటం చూసి తర్వాత నాకు అండగా నిలిచారు. 1999లో అసెంబ్లీ టికెట్ కోసం ప్రయత్నించాను. కానీ రాలేదు. 2001లో ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడినయ్యాను. 13 ఏళ్ల పాటు సుదీర్ఘంగా, రికార్డు స్థాయిలో పనిచేశాను. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఎంతో కష్టపడ్డాను. అప్పట్లో సోషల్ మీడియా ఎక్కడిది? టీవీలు, పేపర్లే ఉండేవి. రోజూ కార్యక్రమాలు చేస్తూ ప్రజల కోసం కొట్లాడేవాళ్లం. 2004లో ప్రభుత్వం రావడంలో కీలకంగా పనిచేశాను. 2014 వరకు డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగాను. ఆ సమయంలో నన్నెవరూ తీసేయలేదు. నేనే తప్పుకున్నాను. అప్పట్లో ఏ న్యూస్ చానల్ పెట్టినా నేను కనిపించేవాడిని. అంతగా కష్టపడ్డాను.

తొలి నాళ్లలో వ్యవసాయం, వ్యాపారం

పోరాటాల పరకాల గడ్డపై పుట్టి వ్యాపారంలో విజయాలు సాధించాను. చదువు మీద పెద్దగా ఇష్టం లేదు. హన్మకొండ సెయింట్ జోసఫ్ స్కూల్‌లో పదో తరగతి వరకు చదివి, హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ పూర్తి చేశాను. చిన్నప్పటి నుంచే ఉద్యోగం చేయాలనే ఆలోచన నాకు లేదు. ఏదైనా అడ్వెంచర్ చేయాలనే ఆలోచన ఉండేది. అందుకు అనుగుణంగానే నా అడుగులు పడ్డాయి. వ్యవసాయం అంటే చిన్నప్పటి నుంచే నాకు చాలా ఇష్టం. ఇప్పటికీ ఖాళీ సమయం దొరికితే పొలాల దగ్గరకు వెళ్తాను. వ్యవసాయ పనులన్నీ నాకు తెలుసు. మా కుటుంబానికి చిన్నప్పటి నుంచే భూములు ఉన్నాయి. అప్పట్లో కూలీలు మా ఇంటికి వచ్చి తిండికి అడిగితే జొన్నలు ఇచ్చేవాళ్లం. పని సీజన్‌లో వచ్చి కూలీ తీసుకోకుండా కూడా పనిచేసేవాళ్లు. అప్పట్లో ఆ నియత్ ఉండేది. ఇప్పుడు ఒకరికి తిండిపెట్టాల్సిన అవసరం కూడా లేకుండా పోయింది. అటుపై వ్యాపారం కూడా ఇష్టంగా చేశాను.

పోరాటాలే తనకు ఇష్టం.. పదవులు అనుకోలేదు

వ్యవసాయం, వ్యాపారం, రాజకీయం...ఈ మూడు ఆయన జీవితంలో ప్రధాన అంశాలు. ఉమ్మడి కుటుంబం నేపథ్యంలో నుండి వచ్చిన ఆయన ఇప్పటికీ వ్యవసాయాన్ని మరిచిపోలేదు. వ్యాపారం ఆయన సహజ లక్షణాలను బహిర్గతం చేస్తే.. రాజకీయాలతో తిరుగులేని గుర్తింపు, విజయాలను వెంట తెచ్చుకున్నాడు. ఎప్పుడైనా ప్రజల కోసం చేసిన పనులు, ఎదుర్కొన్న పోరాటాలే తన రాజకీయ ప్రస్థానానికి, భవిష్యత్తుకు పునాది అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. విద్యార్థి నాయకుడిగా ఉన్నా, చిన్నప్పటి నుండే రాజకీయ ఆలోచనలతో, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు నడిచాడు. ఈ బాటలో ఎన్నో ముళ్ళు, పూలు. ఎన్నో కుట్రలు ఎదురైనా వెనక్కి తగ్గలేదని, తన పనితీరే తన ఎదుగుదలకు కారణమైందని చెప్పారు. తనకు గాడ్ ఫాదర్ ఎవరూ లేరని సూటిగా చెప్తూ...భూపాలపల్లి నియోజకవర్గాన్ని కుటుంబంగా భావించి అభివృద్ధి కోసం పనిచేశానని, వారితోనే నా భవిష్యత్తు అని తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన వ్యక్తిగత, రాజకీయ జీవితానికి సంబంధించిన ఆసక్తికర అంశాలను గండ్ర వెంకటరమణారెడ్డి వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. - అక్షరశక్తి, వరంగల్



విద్యార్థిగా రాజకీయాలు

పాలిటెక్నిక్ చదువుతున్న సమయంలోనే విద్యార్థి నాయకుడిగా పనిచేశాను. పాలిటెక్నిక్ చదివిన విద్యార్థులకు బీటెక్ సెకండియర్‌లో అడ్మిషన్లు వచ్చేలా చేసిన పోరాటాలు మా ఉద్యమాల వల్లే జరిగాయి. ఆ ఉద్యమాల కారణంగా నేను అకాడమిక్ ఇయర్ లాస్ అయ్యాను. 'ఊ అంటే ఉద్యమాలు చేస్తున్నావు' అంటూ నన్ను ట్రాన్స్‌ఫర్ చేశారు. నేను చదువుకున్న కాలేజీలోనే దివంగత పీజేఆర్ కూడా చదువుకున్నారు. మా కాలేజీ ప్రిన్సిపాల్ నా దూకుడు చూసి.. 'పీజేఆర్ మన కాలేజీలోనే చదువుకున్నాడు.. ఆయన లీడర్ అయ్యాడు.. నువ్వు కూడా లీడర్ అవుతావు. తొందరపడకు' అని చెప్పేవారు. ఆ మాట ఇప్పటికీ గుర్తుంది. ఎన్టీఆర్‌ను సీఎం పదవి నుంచి తొలగించినప్పుడు అన్యాయం జరిగిందనే ఆలోచనతో బస్సు టైర్లలో గాలి తీశాం. ఇలా ఎన్నో ఉద్యమాలు చేశాం. అప్పట్లో చాలా దూకుడుగా ఉండేవాడిని. ఒకసారి హయగ్రీవాచారి దగ్గరకు వెళ్లినప్పుడు.. 'నీ అనుభవం అంతా నా వయస్సు లేదు నీకు.. ఇంత దురుసు ఎందుకు?' అంటూ ఆయన కన్నెర్ర చేశారు.

టీడీపీ టికెట్ వచ్చినా వెళ్లలేదు

2004లో టీడీపీ నుంచి నాకు టికెట్ ఆఫర్ వచ్చింది. కానీ నేను చేసిన పోరాటం అంతా టీడీపీకి వ్యతిరేకంగానే. అలాంటి పార్టీలోకి వెళ్ల టికెట్ తెచ్చుకోవడం సరికాదని భావించి వెళ్లలేదు. ఎన్టీఆర్ అంటే నటుడిగా నాకు అభిమానం. ఆయన కొన్ని పాలనా సంస్కరణలు తీసుకొచ్చారు. నా తరం చూసినంత మార్పును ఇంకే తరం చూసి ఉండదు.. చూడదు కూడా. చాలా వేగంగా మార్పులు జరిగాయి. అన్ని మార్పులను ఆస్వాదించాల్సిందే. నేను కరువును రెండుసార్లు చూశాను.

నాకు గాడ్ ఫాదర్ లేడు

నా పనితీరే నా ఎదుగుదలకు కారణం. నాకు రాజకీయాల్లో ఎవరు గాడ్ ఫాదర్ లేడు. ఎలాంటి పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ లేకుండానే ఈ స్థాయికి ఎదిగాను. అప్పట్లో కొంతమంది హవా నడిచేది. వారిని ఓవర్‌కమ్ చేసి ఎదిగాను. ఎంతో కష్టపడ్డాను. నా ఫర్మామెన్సే నా ఎదుగుదలకు కారణం. రాజకీయాలంటేనే కుట్ర. తడిగుడ్డతో గొంతు కోస్తారు. నవ్వుతూనే ప్రాణం తీస్తారు. నన్ను తొక్కేందుకు, నాకు అవకాశాలు రాకుండా చేసేందుకు అన్ని విధాలా ప్రయత్నించారు. నేను కడక్‌గా ఉండేవాడిని. భయపడేవాడిని కాదు. అందుకే నెట్టుకొచ్చాను.



ఎమ్మెల్సీగా గెలుపు.. అదీ ఓ రాజకీయ కుట్రే

2007లో ఎమ్మెల్సీగా అవకాశం రావడం కూడా ఒక రాజకీయ కుట్రే. కానీ గెలిచి చూపించాను. హనుమకొండ నుంచి నన్ను ఎమ్మెల్యేగా పోటీ చేయించాలని వైఎస్ ఆలోచించారు. అక్కడ అవకాశం లేకపోవడంతో వరంగల్ ఎంపీగా పోటీ చేయాలని అన్నారు. నాకు టికెట్ ఇచ్చేందుకు లైన్ క్లియర్ అయింది. నేను కూడా పోటీకి సిద్ధమయ్యాను. అప్పుడు కుట్రలు జరిగాయి. నేను పోటీ చేస్తానని తట్టుకోలేక పొత్తులో భాగంగా రెండు ఎంపీ టికెట్లను అప్పటి టీఆర్ఎస్‌కు ఇచ్చారు. ఆ తర్వాత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థానాలు ఉండేవి. అయితే అందులో అప్పటికే ఓ రెడ్డికి టికెట్ ఖరారైంది. దీంతో నేను వద్దనుకున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి వెళ్లాను. అప్పుడు కాంగ్రెస్ బలం తక్కువ. ఓడిపోతారని అందరూ అనుకున్నారు. కానీ కేసీఆర్ ఇచ్చిన మాట మేరకు పొత్తులో టీఆర్ఎస్ సంపూర్ణంగా సహకరించింది. 115 ఓట్లతో నేను గెలిచాను.

మంత్రి పదవి పోయినా బాధపడలేదు...

2011లో మంత్రి అయ్యే అవకాశం మిస్ అయింది. పార్టీ అధిష్ఠానం నుంచి నా పేరు వచ్చింది. కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా 'డన్.. నీ పేరు వచ్చింది' అన్నారు. మరుసటి రోజు గవర్నర్ వద్ద ప్రమాణ స్వీకారం ఉంటుందని చెప్పారు. నేను ఇంటికి వచ్చాను. ఉదయం నాకు ఫోన్ రాలేదు. అక్కడ ప్రమాణ స్వీకారం అయిపోయింది. హటాహుటిన అక్కడికి వెళ్తే రోశయ్య 'గండ్ర.. నీ పేరు కేబినెట్‌లో ఎలా మిస్ అయింది?' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మంత్రి వర్గ విస్తరణ సమయంలోనూ అలాగే కుట్రలు జరిగాయి. రెండోసారి కూడా మంత్రి పదవి మిస్ అయింది. అయినా బాధపడలేదు. హైకమాండ్ నుంచి ప్రెషర్ ఉన్నా స్థానిక కుట్రలతో అవకాశం రాలేదు. కానీ ఎదుగుదలను ఎవరూ ఆపలేరు. 2012లో చీఫ్ విప్ అయ్యాను.

2019లో బీఆర్ఎస్‌లోకి..

2019లో అప్పటి పరిస్థితుల నేపథ్యంలో బీఆర్ఎస్‌లో చేరాను. కేటీఆర్‌తో ఉద్యమ సమయం నుంచే పరిచయం ఉంది. కేసీఆర్‌తో మంచి అనుబంధం ఉంది. ఆయన వర్కింగ్ సిస్టమ్ వేరే. కేసీఆర్ కలవడం లేదు.. కలవడం లేదు అంటారు. కానీ కలిసిన రోజు సమస్యలన్నీ తీరిపోతాయి. పెండింగ్ పనులన్నీ క్లియర్ అవుతాయి. 30 నిమిషాలో, గంట సమయమో అనుకుంటే ఒక్కోసారి రోజు, ఓ పూట అంతా ఆయనే సమయం తీసుకుంటారు. కేసీఆర్‌కు ప్రతి విషయంలో అవగాహన ఉంది. ఏ విషయంపైనైనా, ఏ సమస్యపైనైనా అనర్గళంగా మాట్లాడుతారు.

డబ్బే రాజకీయాల్లో ప్రధాన సమస్య

చిన్నప్పటి నుంచి కొంత ఉన్న కుటుంబం కావడంతో పెద్దగా ఇబ్బందులు పడలేదు. డబ్బులే రాజకీయాల్లో ప్రధాన సమస్య. అవి ఉంటే రాజకీయ ప్రయాణం సాఫీగానే సాగుతుంది. రాజకీయం అంటే డబ్బులతో ముడిపడిన అంశం. అందుకే బిజినెస్ వైపు కూడా అడుగులు వేశాను. రిజర్వేషన్ కలిసి రావడంతో 2005లో నా భార్య గండ్ర జ్యోతిని వరంగల్ మేయర్ చేయాలనుకున్నాను. నాకు టికెట్లు మిస్ కావడంతో వైఎస్‌తో మాట్లాడి బరిలో నిలిచాం. కానీ గెలిచిన తర్వాత జరిగిన కుట్రలతో అదీ మిస్ అయింది. రాజకీయంలో ఎదగకుండా కుట్రలు సైలెంట్‌గా చేస్తుంటారు.

భూకబ్జాలంటూ నిందలు వేస్తున్నారు

నా మీద భూకబ్జాలంటూ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, సీఎంపై పరువు నష్టం కేసు వేశాను. ఎకో పార్క్ పెట్టిందే నేను. వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశాను. భూమిని కాపాడాలని కోర్టుకు వెళ్లి పోరాడిన నేను భూకబ్జా చేశానంటూ కుట్రలు చేస్తున్నారు. బట్టకాల్చి మీద వేయాలని చూస్తున్నారు. నాకు భూకబ్జాలు చేయాల్సిన అవసరం లేదు. భూపాలపల్లిలో ఆధ్యాత్మిక వాతావరణం కోసం గుడి కడితే దాన్ని కూడా రాజకీయం చేశారు. ప్రభుత్వ భూమిలో కట్టిన గుడిపై కేసులు వేశారు. నిర్మాణంలో అడుగడుగునా ఇబ్బంది పెట్టారు.

రిజర్వేషన్ వస్తే గండ్ర జ్యోతి బరిలో

గండ్ర జ్యోతి నుంచి నాకు ఫుల్ సపోర్ట్ ఉంటుంది. మహిళలతో ఆమెకు మంచి అటాచ్‌మెంట్ ఉంటుంది. మహిళా రిజర్వేషన్ వస్తే తప్పకుండా ఎమ్మెల్యే బరిలో గండ్ర జ్యోతి ఉంటుంది. ఇప్పటికే వరంగల్ జెడ్పీ చైర్మన్‌గా చేశారు. భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా కూడా పనిచేసింది. మహిళల్లో ఆమెకు ఉన్న అనుబంధం, రాజకీయ అనుభవం ఉపయోగపడతాయి.

రేవంత్ సర్కార్‌ను ఎవరూ నమ్మడం లేదు


కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కింది. ప్రభుత్వ పాలన తీరు ఎలా ఉందో సగటు రైతులే చెబుతారు. పెన్షన్, రైతు భరోసా, బీమా, ఆడబిడ్డలకు రూ.2,500, యూరియా కష్టాలు.. ఇలా ఒక్కటేమిటి.. అన్ని సమస్యలే. అన్ని మోసాలే. ప్రజలంతా మాయ నుంచి తేరుకున్నారు. రేవంత్ సర్కార్‌ను అనాస్థిషియా ఇచ్చి మళ్లీ పడుకోబెట్టే కాలం దగ్గర్లోనే ఉంది. ప్రస్తుత ఎమ్మెల్యే దీపం ఉండగానే సక్కబెట్టుకోవాలనే చందంగా పనిచేస్తున్నాడు. తమ్ముడు, కుటుంబ సభ్యులకు వసూళ్ల కోసం శాఖలను పంచిండు. ఆయన తీరుతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

పనికి గుర్తింపు లేకుండా పోయింది

ప్రస్తుత రాజకీయంలో గెలుపు, ఓటములకు పనులకు సంబంధం లేకుండా పోయింది. గతంలో పని చేసే వ్యక్తిని గుర్తించి ఎన్నుకునే వారు. ఇప్పుడు ఎంత పని చేసినా ఓటు వేసే వరకు భయపడే పరిస్థితి వచ్చింది. గతంలో ప్రజలు విలువలున్న రాజకీయ నాయకులను ఎన్నుకునేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. మళ్లీ నియోజకవర్గమంతా పాదయాత్ర చేస్తాను. జరిగిన మోసాలను ప్రజలకు వివరిస్తాను. నేను చేసిన పనులను కూడా ప్రజలకు చెబుతాను. ప్రజలతో నాకు ఉన్న అనుబంధమే నా బలం. భూపాలపల్లి అభివృద్ధి కోసం నేను చేసిన పనులను, ఇంకా చేయాల్సిన పనులను ప్రజల ముందుంచుతాను.

రాజకీయాలు.... గౌతమ్ ఇష్టం

నా కొడుకు గండ్ర గౌతమ్ రాజకీయ ప్రవేశం అనేది ఆయన ఇష్టం. ఆయన ఎప్పుడు రాజకీయాల్లోకి వచ్చినా వద్దనేది లేదు. తనకు నచ్చిన సమయంలో రాజకీయాల్లోకి రావచ్చు. అయితే రానున్న రోజుల్లో ఆయన కేటీఆర్ టీంలో ఉంటారు. యువత రాజకీయాల్లోకి రావాలి. గౌతమ్ కూడా తనకు నచ్చిన సమయంలో రాజకీయాల్లోకి వచ్చి ప్రజల కోసం పనిచేయాలని నేను కోరుకుంటాను.



భూపాలపల్లి తోనే అనుబంధం

భూపాలపల్లి కి చాలా చేశాను. నియోజకవర్గానికి తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక ఎన్నో కార్యక్రమాలు చేశాను. అప్పట్లో భూపాలపల్లి సమస్యలకు కేరాఫ్‌గా ఉండేది. డిగ్రీ, ఇంటర్ కాలేజీలు తీసుకొచ్చాను. మొదట్లో ప్రాథమిక వైద్య కేంద్రం మాత్రమే ఉండేది. ఇప్పుడు మెడికల్ కాలేజీ, 100 పడకల ఆస్పత్రితో మెరుగైన వైద్యం అందుబాటులోకి తెచ్చాను. సింగరేణి కార్మికుల కోసం 2 వేల క్వార్టర్స్ కట్టించాం. చెక్‌డ్యామ్‌లు, లిఫ్ట్ ఇరిగేషన్, రోడ్ల వెడల్పు.. ఇలా ఒకటి కాదు, రెండు కాదు అనేక పనులు చేశాం. బైపాస్ రోడ్డు మంజూరైంది కానీ పూర్తికాలేదు. మొత్తం సమస్యలన్నీ పోయినయని కాదు. ఇంకా కొన్ని మేజర్ సమస్యలు ఉన్నాయి. పబ్లిక్‌ను సాటిస్‌పై చేయడం అంత ఈజీ కాదు. నేను నిధుల కోసం బారాబర్‌గా నిలదీసి తెచ్చేవాడిని. భూపాలపల్లి పట్టణం సమ్మిశితం. ఇక్కడ కార్మికులు ఎక్కువ. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాళ్లు ఉంటారు. నా ప్రయాణం అంతా భూపాలపల్లితోనే. నా కుటుంబమే భూపాలపల్లి. భూపాలపల్లి డెవలప్‌మెంటే నా లక్ష్యం. మళ్లీ ఆశీర్వదిస్తే రాష్ట్రంలో నంబర్‌వన్‌గా చేసేందుకు ప్రయత్నిస్తాను.